121) ధన్యాసి

ప॥ పుట్టినట్టి వున్నవాడ పోలేదు రాలేదు । యిట్టె నీదాసుడనైతే యెంగిలెల్ల బాసె ॥

చ॥ వెలినున్న జగమెల్ల విష్ణుడ నీమహిమే । అలరి నాలోన నీవే అంతరాత్మవు ।
తెలిసి నేనున్న చోటే దివ్యవైకుంఠము । వెలలేని నరకముల వెరపెల్ల దీరె ॥

చ॥ తనవుతో నుండేది నీ తలచిన తలపేనా । మనుపు సంసారము నీమాయచేతిదే ।
పనుల నాకర్మము నీపంచినట్టి పనుపే । మనసులోపలి యనుమానమెల్ల బాసె ॥

చ॥ తెరమరుగు దినాలు దేవుడ నీకల్పితమే । సొరది యీసురలెల్ల చుట్టాలె నాకు ।
నిరతి శ్రీవేంకటేశ నీమరుగు చొచ్చినేడు । గురునియానతి చేత గొంకులెల్లబాసె ॥